క్లుప్తంగా

వైభవంగా బీరన్న పట్నాలు, బోనాలు



నాగవెల్లి పట్నం

జూలపల్లి: మండలంలోని చీమలపేటలో బీరన్న పట్నాలు, బోనాల ఉత్సవాలు వైభవంగ నిర్వహించారు. బీర్ల పూజారులు బీరన్న, కామరాతి కల్యాణోత్సవంలో భాగంగా బుధవారం నాగవెల్లి పట్నం వేశారు. కురుమ కుల బాంధవులు బోనాలతో మొక్కులు చెల్లించారు. పెద్దపల్లి ఎమ్మెల్యే విజయరమణారావు ఉత్సవాల్లో పాల్గొని ప్రత్యేక మొక్కులు చెల్లించారు. ఈ సందర్భంగా భక్తులు అగ్నిగుండాలలో నడిచారు. మాజీ సర్పంచ్ తొంటి పద్మ బుచ్చయ్య, కురుమ సంఘం ఉత్సవ కమిటీ సభ్యులు అధ్యక్షుడు తొంటి రాయుడు, కార్యదర్శి బీరయ్య, కార్యవర్గ సభ్యులు, తొంటి రవి, శ్రీహరి, చిన్న బీరయ్య, పెద్ద రాజేశం, మెట్టి సంతు, ఎగుర్ల రమేశ్, రాజయ్య, గుంటి వీరేశం బీరన్నకు మొక్కులు చెల్లించారు.

కార్యదర్శులతో సమీక్షా సమావేశం



మాట్లాడుతున్న ఎంపీడీవో అలీం

రామగుండం: అంతర్గాం మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం వివిధ గ్రామాల పంచాయతీ కార్యదర్శులతో ఎంపీడీవో ఎం ఏ.అలీం సమీక్షా సమావేశం నిర్వహించారు. ముఖ్యంగా రాబోయే వర్షాకాలంలో గ్రామాల్లో చేపట్టే శానిటేషన్, క్లోరినేషన్, స్వచ్ఛమైన తాగునీటి సరఫరా, పైపులైన్ల లీకేజీ, అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ ద్వారా పనులను వేగవంతం చేయడం, ఉపాధి హామీ పనుల పురోగతి, పని ప్రదేశంలో వసతులు, గ్రామాల వారీగా హరితహారం, ప్రతీ మంగళ, శుక్ర వారాలు ట్రాక్టర్ ట్యాంకర్ ద్వారా మొక్కలకు నీరుపోయడం తదితర అంశాలపై మాట్లాడారు. అనంతరం ఇప్పటివరకు ఎన్నికల ప్రక్రియ బిజీగా ఉన్న అధికార యంత్రాంగం ఇక నుంచి క్షేత్రస్థాయిలో విధుల్లో పాల్గొని ప్రజా సమస్యలను పరిష్కరించేందుకు అప్రమత్తంగా వ్యవహరించాలని సూచించారు.

అక్రమ నిర్మాణాలపై ఫిర్యాదు

రామగుండం: అంతర్గాం మండల కేంద్రంలోని టీటీఎస్ అంతర్గాంలోని బర్మా, శ్రీలంక, కాందిశీకులకు చెందిన టెక్స్‌టైల్ శాఖకు చెందిన భూముల్లో అక్రమంగా నిర్మాణాలు చేపడుతున్నారని పలువురు ఫిర్యాదు చేశారు. బుధవారం ఎంపీడీవో ఎంఏ.అలీంకు గ్రామానికి చెందిన న్యాయవాది మేడారం సాయిచందు, మాజీ ఎంపీటీసీ బొడ్డు లింగమూర్తి, ఇండిబిల్లి రవీందర్ తదితరులు ఫిర్యాదు చేశారు. స్పందించిన ఎంపీడీవో క్షేత్రస్థాయిలో పరిశీలించి అక్రమ నిర్మాణాలపై చట్టపరమైన చర్యలు చేపడతామని పేర్కొన్నారు.

ప్రభుత్వ కళాశాలలో చేరండి



ప్రచారం చేస్తున్న అధ్యాపకులు

గోదావరిఖనిటౌన్: పదో తరగతిలో ఉత్తీర్ణులైన విద్యార్థులు ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలలో చేరాలని ఇంటింటికీ తిరుగుతూ కరపత్రాలు పంచుతూ బుధవారం రామగుండం, పాలకుర్తి, అంతర్గాం మండలాల్లో అధ్యాపక బృందం ప్రచారం చేపట్టారు. విద్యార్థుల తల్లిదండ్రులను కలిసి కళాశాల సాధించిన ఉత్తమ ఫలితాలను వివరిస్తూ కళాశాల అందిస్తున్న జనరల్ గ్రూపుల గురించి వివరించారు. కళాశాలలో చేర్పించాలని కోరారు. కళాశాల ప్రిన్సిపాల్ కటకం అంజయ్య, అధ్యాపకులు దామెర శంకర్, రామకృష్ణ, ధనలక్ష్మి, సుమలత పాల్గొన్నారు.

బైబిల్ చదివించేందుకు తీసుకెళ్లారని ఫిర్యాదు

ఎలిగేడు: మండలంలోని నర్సాపూర్ గ్రామానికి చెందిన జంగ శ్రీనివాస్ కూతురుతోపాటు మరో ఇద్దరిని బలవంతంగా బైబిల్ చదివించేందుకు చర్చికి తీసుకువెళ్లారని జంగ శ్రీనివాస్ జూలపల్లి పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు ఎస్సై శ్రీధర్ తెలిపారు. నర్సాపూర్‌ల చర్చిలో హిందువుల పిల్లలను మభ్యపెట్టి చర్చిలకు తీసుకెళ్లి మత బోధనలు చేస్తున్న వారిని అడ్డుకుని పిల్లల తల్లిదండ్రులతో పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.

ఇందిరమ్మకాలనీలో సమస్యల తాండవం

- ఇళ్ల మధ్యే మురుగునీటి గుంతలు
- అధ్వానంగా అంతర్గత రోడ్లు
- పాత బావులతో పొంచి ఉన్న ప్రమాదం
- పరిష్కరించాలని ప్రజల వేడుకోలు



ప్రమాదకరంగా పాత బావి



ఇళ్ల మధ్యే నిలిచిన మురుగునీరు

జ్యోతినగర్: రామగుండం కార్పొరేషన్‌లోని రెండో డివిజన్ ఇందిరమ్మ కాలనీ ఫేజ్–2 సమస్యల ముల్లెగా మారింది. అత్యంత ఎక్కువ మంది పేదలు నివసించే ప్రాంతంలో సమస్యలు కూడా అదేక్రమంలో పెరిగాయి. అంతర్గత రోడ్లు అధ్వానంగా ఉండటంతో పాటు మురుగు కాలువలు లేకపోవడంతో ఇళ్ల నుంచి వచ్చే మురుగునీరు గుంతల్లో నిలిచి దుర్వాసన వెదజల్లుతోంది. ఫేజ్–2లో ఉన్న సిక్కువాడలో రెండు పాడుబడిన పెద్ద బావులు ప్రమాదకరంగా మారాయి. వేసవి కాలంలో పిల్లలు వాటి పక్కనే అడుకునే క్రమంలో ప్రమాదాలకు గురయ్యే అవకాశం ఉంది. సంబంధిత అధికారులు కాలనీని పరిశీలించి ప్రజల సమస్యలు పరిష్కరించాలని స్థానికులు వేడుకుంటున్నారు.

శ్రద్ధచూపని అధికారులు..

పేదల నివాస గృహాల కోసం అప్పటి ప్రభుత్వం 2008లో మేడిపల్లి శివారులో భూమిని కేటాయించి 6,365 మందికి స్థలాలను మంజూరు చేసేందుకు ప్రతిపాదనలు చేసింది. కొంతమంది లబ్ధిదారులకు సైతం మంజూరు చేశారు. అయితే వారి కుటుంబ నేపథ్యం మేరకు ఇళ్లను నిర్మించుకుని నివాసముంటున్నారు. ఆనాటి నుంచి నేటి వరకు రెండో డివిజన్‌లోని ఇందిరమ్మకాలనీ సమస్యలకు నిలయంగా మారింది. ప్రజల మౌలిక వసతుల కల్పనపై అధికారులు, పాలకులు సరైన శ్రద్ధ చూపకపోవడంతో ప్రజలు నానా అవస్థలు పడుతున్నారు. కాల్వలు నిర్మించకపోవడంతో రోడ్డుపైనే మురుగు నీరు నిలిచి దుర్వాసన వెదజల్లుతోంది. సైడ్ కాలువలు లేకపోవడంతో మురుగు నీరు రోడ్డుపై నిలిచి అపరిశుభ్రంగా కనిపిస్తోందని కాలనీవాసులు వాపోతున్నారు. దుర్వాసనతో అనారోగ్యానికి గురవుతున్నామని ఆందోళన చెందుతున్నారు.

అంతర్గత రోడ్లు అధ్వానం..

ఇందిరమ్మకాలనీలోని అంతర్గత రోడ్లు పూర్తిగా అధ్వానంగా ఉన్నాయి. మెయిన్ రోడ్డు కాస్త ఉన్నప్పటికీ ఇళ్ల మధ్య రోడ్డు లేకపోవడం, సైడ్ కాలువలు నిర్మించకపోవడంతో ఇళ్ల నుంచి వచ్చే మురుగు నీరు రోడ్డుపై నిలుస్తోంది. వెంటనే తమ సమస్యలు పరిష్కరించాలని కాలనీవాసులు కోరుతున్నారు.

పాడుబడిన బావుల్ని పూడ్చి వేయించండి



ఇందిరమ్మకాలనీలో సౌకర్యాలు లేక చాలా ఇబ్బందులు పడుతున్నాం. కాలనీలో నిర్మించిన పార్కు పూర్తిస్థాయిలో నిర్మించకపోవడంతో ముళ్లపొదలు ఎక్కువగా ఉన్నాయి. సిక్కువాడలో ఉన్న రెండు పాడుబడిన బావులను పూడ్చివేయించండి. పిల్లలు ఆడుకునే సమయంలో జారిపడే ప్రమాదం ఉంది.

– లక్ష్మి, ఇందిరమ్మకాలనీ

ప్రజలు అవస్థలు పడుతున్నారు



రెండో డివిజన్ ఇందిరమ్మకాలనీ, న్యూపీకే రామయ్య కాలనీలో ప్రజలు సమస్యలతో ఇబ్బందులు పడుతున్నారు. తాగునీటి సమస్యతో పాటు కాలనీలో ఏర్పాటు చేసిన రెండు పార్కులు నిరుపయోగంగా ఉన్నాయి. గతంలో ఎన్టీపీసీ సంస్థ సీఎస్సార్ నిధులతో అభివృద్ధి చేసేది. ప్రస్తుతం కొంత మేర జాప్యం చేస్తుండటంతో ప్రజలు అవస్థలు పడుతున్నారు.

– పసుల ప్రకాశ్, రెండో డివిజన్

జాతీయ ఎస్సీ కమిషన్ సభ్యుడికి సన్మానం



సన్మానిస్తున్న బీఎంఎస్ నాయకులు

జ్యోతినగర్: జాతీయ ఎస్సీ కమిషన్ సభ్యుడు వడ్డెపల్లి రాంచెందర్‌ను బుధవారం రాత్రి ఘనంగా సన్మానించారు. ఎన్టీపీసీ రామగుండం పర్మనెంట్ టౌన్‌షిప్‌లోని జ్యోతి ఫంక్షన్ హాలులో బీఎంఎస్ అనుబంధ ఎన్టీపీసీ కార్మిక సంఘ్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా జాతీయ ఎస్సీ కమిషన్ సభ్యుడు పాల్గొని మాట్లాడారు. క్రమశిక్షణ, అంకితభావంతో పనిచేస్తే ఉన్నత శిఖరాలను అధిరోహించవచ్చన్నారు. అనంతరం బీఎంఎస్ రాష్ట్ర అధ్యక్షుడు కలాల్ శ్రీనివాస్, సెంట్రల్ ఎన్సీసీ సభ్యుడు ఎస్.మల్లేషం, అడిషనల్ ఎన్సీసీ సభ్యుడు ఆర్.ఎన్.గణేశ్‌తో పాటు ఎన్టీపీసీ కార్మిక సంఘ్ నాయకులు జాతీయ ఎస్సీ కమిషన్ సభ్యుడిని సన్మానించారు. కార్యక్రమంలో హెచ్‌ఎంఎస్ రాష్ట్ర నాయకుడు సీహెచ్ ఉపేందర్, మొగురం గట్టయ్య, బీఎంఎస్ నాయకులు బూర్ల లక్ష్మీనారాయణ, కంది శ్రీనివాస్, సాగర్‌రాజు తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ తీగలకు అడ్డుగా ఉన్నాయని..



నరికివేసిన చెట్లు

- హరితహారం చెట్ల నరికివేత

ముత్తారం: రోడ్డుకు ఇరువైపులా ఓ శాఖ అధికారులేమో హరితహారంలో మొక్కలు నాటుతుంటే అవి పెద్దవి అయ్యాక విద్యుత్ లైన్‌కు అడ్డుగా ఉన్నాయని మరో శాఖ అధికారులు కొట్టివేయిస్తున్నారు. ఆర్ అండ్‌బీ శాఖ, ఉపాధిహామీ, అటవీ శాఖ, విద్యుత్ శాఖల అధికారుల సమన్వయ లోపమో.. నిర్లక్ష్యమో కానీ వేలాది చెట్లు నరికివేతకు గురవుతున్నాయి. ముత్తారం మండలంలోని మంథని–ఓడెడ్, కేశనపల్లి–బేగంపేట ఆర్‌అండ్‌బీ రోడ్డును పరిశీలిస్తే ఈ విషయం అర్థం అవుతుంది. ఆర్‌అండ్‌బీ రోడ్డు నిబంధనలకు విరుద్ధంగా మొక్కలు నాటడం, విద్యుత్ స్తంభాలు లైన్ వేయడంతో ఈ సమస్య తలెత్తుతోంది. హరితహారంలో మొక్కలు నాటిన నుంచి చెట్టు అయ్యే వరకు రూ.లక్షలో ఖర్చు అవుతుంది. విద్యుత్ లైన్ వేయడంతో పాటు చెట్ల నరికివేతకు సైతం ఖర్చు అవుతుంది.

అడ్డుగా ఉన్నాయని తొలగించాం..

మండలంలోని మంథని–ఓడెడ్, కేశనపల్లి–బేగంపేట రోడ్డుకు ఇరువైపులా విద్యుత్ లైన్‌కు అడ్డుగా ఉన్న చెట్లకొమ్మలను తొలిగించామని ట్రాన్స్‌కో ఏఈ హనుమాన్‌దాస్ తెలిపారు. విద్యుత్ లైన్ కింద మొక్కలు నాటడంతో ఈ పరిస్థితి నెలకొందని ఆయన పేర్కొన్నారు.

బీటీ రోడ్డు పూర్తయ్యేదెన్నడు?



సుల్తానాబాద్ - గట్టెపల్లి రోడ్డు

సుల్తానాబాద్‌రూరల్: సుల్తానాబాద్ పట్టణం నుంచి గట్టెపల్లి వరకు చేపట్టిన బీటీ రోడ్డు పనులు నెలలు గడుస్తున్నా పూర్తి కాలేదు. ఐదు కిలోమీటర్ల మేరకు బీటీ రోడ్డు నిర్మాణం కోసం కాంట్రాక్టర్ పనులను దక్కించుకున్నాడు. రోడ్డును తవ్వి కంకర పోసి వదిలేశాడు. దీంతో బీటీ రోడ్డు పూర్తికాకపోవడంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. రోడ్డు వెంట ఉన్నవారి ఇళ్లల్లో దుమ్ముపడి అవస్థలు పడుతున్నారు. సంబంధింత అధికారులు చొరవ తీసుకొని రోడ్డు పనులు పూర్తయ్యేలా వెంటనే చర్యలు తీసుకోవాలని స్థానిక ప్రజలు, వాహనదారులు కోరుతున్నారు.

ఘనంగా రేణుక ఎల్లమ్మ పట్నాలు



సన్మానిస్తున్న కులసంఘం నాయకులు

సుల్తానాబాద్‌రూరల్: మండలంలోని ఐతరాజుపల్లి గ్రామంలో శ్రీరేణుక ఎల్లమ్మ పట్నాలను బుధవారం గౌడ కులస్తులు ఘనంగా నిర్వహించారు. అలాగే తొగర్రాయిలో శ్రీ బీరన్న పట్నాలను ఘనంగా నిర్వహించారు. కాగా ఎమ్మెల్యే విజయరమణారావు దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. ఐతరాజుపల్లిలో బీఆర్‌ఎస్ రాష్ట్ర నాయకుడు నల్ల మనోహర్‌రెడ్డి, బీజేపీ రాష్ట్ర యువ నాయకులు ఏగోలపు సదయ్యగౌడ్ దర్శించుకున్నారు.

ఇసుక అక్రమ తరలింపును ప్రోత్సహిస్తున్న కాంగ్రెస్



మాట్లాడుతున్న బీఆర్‌ఎస్ నాయకులు

కమాన్‌పూర్: కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక మంథని నియోజకవర్గంలో ఇసుక, మట్టి అక్రమ తవ్వకాలను ప్రోత్సహిస్తోందని బీఆర్‌ఎస్ నాయకులు ఆరోపించారు. మండల కేంద్రంలోని ప్రెస్‌క్లబ్‌లో బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. బీఆర్‌ఎస్ అధికారంలో ఉన్నప్పుడు ఇసుక, మట్టి దందాలను ప్రోత్సహిస్తోందని ఆరోపణలు చేసిన నాయకులే కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన అనతి కాలంలోనే దందాలు చేస్తుండం సిగ్గుగా ఉందన్నారు. జూలపల్లి పెద్ద చెరువులో అనుమతికి మించి మట్టి తవ్వకాలు చేస్తున్నారని ఆరోపించారు. సమావేశంలో మాజీ జెడ్పీటీసీ మేకల సంపత్‌యాదవ్, బొమ్మగాని అనిల్, గుర్రం లక్ష్మిమల్లు, నీలం శ్రీనివాస్, తోట వీరస్వామి, పొన్నం రాజేశ్వరి, సుధాకర్, రాజ్‌కుమార్ పాల్గొన్నారు.

వేంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలు ప్రారంభం

ఎలిగేడు: మండలంలోని శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయంలో శ్రీవేంకటేశ్వరస్వామి కల్యాణోత్సవాల్లో భాగంగా ఆలయంలో బ్రహ్మోత్సవాలు వైభవంగా ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా బుధవారం ఆలయంలో సాయంత్రం అధ్యయనోత్సవం ఆరంభం, తొళ్లక్కం వంటి ప్రత్యేక పూజా కార్యక్రమాలను వేదపండితులతో ఘనంగా నిర్వహించారు.

హనుమాన్ ఆలయంలో నిత్యాన్నదానం



సుల్తానాబాద్: మండల కేంద్రంలోని హనుమాన్ ఆలయంలో నిత్యాన్నదాన కార్యక్రమాన్ని ఆలయ కమిటీ చైర్మన్ అకుల రామేశ్వర్‌రావు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ హనుమాన్ దీక్ష తీసుకున్న స్వాములకు ఈ ఆలయంలో సౌకర్యాలు కల్పించామని, భక్తులకు నిత్యాన్నదాన కార్యక్రమం నిర్వహించేందుకు దాతలు ముందుకు రావాలని కోరారు. కార్యక్రమంలో పూజారి సంతోష్, హనుమాన్ దీక్షాస్వాములు పాల్గొన్నారు.

ఆలయానికి విద్యుత్ సరఫరా చేయాలి



వినతిపత్రం ఇస్తున్న కందుల సంధ్యారాణి

జ్యోతినగర్: ఎన్టీపీసీ రామగుండం టెంపరరీ టౌన్‌షిప్‌లోని హనుమాన్ ఆలయానికి విద్యుత్ సరఫరా చేయాలని ఎన్టీపీసీ అధికారులకు బీజేపీ రామగుండం ఇన్‌చార్జి కందుల సంధ్యారాణి వినతిపత్రం అందించారు. బుధవారం ఆమె ఆలయ అర్చకులు సురేశ్‌శర్మతో కలిసి ఎన్టీపీసీ అధికారులకు వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. పురాతన హనుమాన్ ఆలయంలో భక్తులు పూజలు చేస్తున్నారని, విద్యుత్ సరఫరా లేకపోవడంతో ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. ఎన్టీపీసీ సంస్థ ఆలయానికి విద్యుత్ సరఫరా చేయాలని కోరారు. ఎన్టీపీసీ మండల అధ్యక్షుడు మిట్టపల్లి సతీశ్, బీజేపీ సీనియర్ నాయకులు తోట కుమారస్వామి, పైతరి రాజు, సుమంత్ పటేల్, మహేందర్, నవీన్ పాల్గొన్నారు.

మత్తుకు బానిసైతే భవిష్యత్ చిత్తు



ఇప్పలపల్లిలో కళాకారుల కళాజాత

కాల్వశ్రీరాంపూర్: మండలంలోని ఇప్పలపల్లి గ్రామంలో బుధవారం కలెక్టర్ ఆదేశాల మేరకు డీపీఆర్‌వో నేతృత్వంలో తెలంగాణ సాంస్కృతిక సారథి కళాబృందం మాదకద్రవ్యాల వినియోగంపై ప్రజలను చైతన్య పరిచారు. మాదకద్రవ్యాలకు బానిసైతే భవిష్యత్ నాశనం అవుతుందని కళాప్రదర్శన చేశారు. భ్రూణహత్యలు మానండి–ఆడపిల్లలను బతకనివ్వండి, బేటీ పడావో–బేటీ బచావో, పరిసరాల పరిశుభ్రత–ఆరోగ్యానికి మార్గం, వడదెబ్బ తగలకుండా జాగ్రత్తలు పాటించండి, వేగం వద్దు ప్రాణం ముద్దు, మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండు–విద్యతో విజ్ఞానం పెంపొందించుకో అంటూ సామాజిక అంశాలతోపాటు కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తున్న ఆరుగ్యారంటీ పథకాలపై ప్రజలను చైతన్య పరిచారు. కళాబృందం సభ్యులు కొండ్ర వెంకన్న, రేణుకాదేవి, మల్లేశం గౌడ్, సలేంద్ర రాజన్న, జనగామ రాజనర్సు, పద్మ, రమాదేవి, శంకర్‌గౌడ్ పాల్గొన్నారు.

ప్రజల గుండెల్లో చిరస్మరణీయుడు గీట్ల



పెద్దపల్లిరూరల్: నివాళి అర్పిస్తున్న నాయకులు

ఎలిగేడు: ప్రజల గుండెల్లో గీట్ల ముకుందరెడ్డి ఎల్లప్పుడూ చిరస్మరణీయుడిగా నిలుస్తారని గీట్ల అభిమానులు అన్నారు. బుధవారం మండల కేంద్రంలో పెద్దపల్లి మాజీ ఎమ్మెల్యే స్వర్గీయ గీట్ల ముకుందరెడ్డి జయంతి నిర్వహించారు. ఎలిగేడు, నారాయణపల్లి పంచాయతీల్లో పనిచేస్తున్న పారిశుధ్య కార్మికులకు ఎలిగేడు బస్టాండు వద్ద దుస్తులు అందజేశారు. అనంతరం స్వీట్లు పంపిణీ చేశారు. మాజీ సర్పంచులు భారతి–అంజయ్య, బాసంపల్లి కొండయ్య, విండో మాజీ చైర్మన్ నరహరి సుధాకర్‌రెడ్డి, మాజీ ఉపసర్పంచ్ గుడుగుల మహేందర్, సింగిల్ విండో మాజీ డైరెక్టర్ రంగు శ్రీనివాస్, మాజీ వార్డు సభ్యులు మామిడాల రమేశ్, చింతిరెడ్డి శ్రీనివాసరెడ్డి, కవ్వంపల్లి నారాయణ, తాటిపల్లి సతీశ్‌బాబు, కాంగ్రెస్ నాయకులు అమ్ముల శ్రీనివాస్‌యాదవ్, కవ్వంపల్లి కొండయ్య, బుర్ర శ్రీనివాస్, న్యాతరి సంపత్, కంకణాల రాజిరెడ్డి, మండల యూత్ నాయకులు కప్పల ప్రవీణ్ పాల్గొన్నారు.

పెద్దపల్లిలో..

పెద్దపల్లిరూరల్: పెద్దపల్లి మాజీ ఎమ్మెల్యే గీట్ల ముకుందరెడ్డి జయంతి బుధవారం కాంగ్రెస్ నాయకులు, గీట్ల అభిమానులు జరుపుకున్నారు. గీట్ల ముకుందరెడ్డి చిత్రపటానికి నాయకులు దండ నర్సింహారెడ్డి, పైడరవి, విండో చైర్మన్ నర్సింహారెడ్డి, ఆనంద్, సంతోష్, కొండి సతీశ్, శ్రీనివాస్, వెంకటేశ్, సునీల్‌గౌడ్, ప్రసాద్, సదానందం తిరుమలేశ్ లక్ష్మణ్, మహేందర్ పూలమాలలు వేసి నివాళి అర్పించారు. పెద్దపల్లి నియోజకవర్గ అభివృద్ధిలో గీట్ల పాత్ర కీలకమని గుర్తు చేసుకున్నారు.

కూనారంలో నివాళి..

కాల్వశ్రీరాంపూర్: పెద్దపల్లి మాజీ ఎమ్మెల్యే, ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఆగ్రోస్ మాజీ చైర్మన్ స్వర్గీయ గీట్ల ముకుందరెడ్డి జయంతి బుధవారం ఆయన స్వగ్రామం కూనారంలో నిర్వహించారు. ఆయన సమాధి వద్ద పుష్పగుచ్ఛం ఉంచి నివాళి అర్పించారు. ఎంపీటీసీ కొల్లూరి రమాదేవి రాయమల్లు, మాజీ సర్పంచు డొంకెన విజయ, మాజీ ఎంపీటీసీ మొగిలి, రాజేశ్వరి, నాయకులు గీట్ల గుణాకర్‌రెడ్డి, కొమురయ్య, పురుషోత్తం పాల్గొన్నారు.

నక్కల వాగుపై రెయిలింగ్ నిర్మించాలి



మొట్లపల్లి శివారులో నక్కల వాగుపై రెయిలింగ్ లేక వాగులో పడిపోయిన లారీ

కాల్వశ్రీరాంపూర్: మండలంలోని మొట్లపల్లి ఆర్‌అండ్‌బీ రహదారిలో నక్కలవాగు కల్వర్టుపై రెయిలింగ్ లేక తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయి. గతంలో నీటి ప్రవాహంలో కల్వర్టుపై నుంచి పలువురు వాహనదారులు కొట్టుకుపోయారు. ఇటీవల ఓ లారీ రెయిలింగ్ లేకపోవడంతో ఎదురుగా వస్తున్న వాహనానికి సైడ్ ఇవ్వబోయి కల్వర్టు నుంచి వాగులో పడిపోయింది. ఈదారి గుండా జమ్మికుంట, భూపాలపల్లి ప్రాంతాలకు అనునిత్యం ఆర్టీసీ బస్సులు, ప్రయివేటు వాహనాల్లో ప్రయాణికులు రాకపోకలు సాగిస్తుంటారు. నీటి ప్రవాహం ఉన్న సమయంలో ఏదైనా వాహనం ప్రమాదానికి గురైతే ప్రాణాపాయం కూడా జరగవచ్చు. ఇప్పటికైనా ఈ రహదారిపై నక్కల వాగుపై ఉన్నతాధికారులు చర్యలు తీసుకుని రెయిలింగ్ నిర్మాణం చేపట్టాలని, శాశ్వత పరిష్కారంగా ఓవర్‌బ్రిడ్జి నిర్మాణం చేపట్టాలని కోరుతున్నారు. వర్షాకాలంలో వరదలు వచ్చినా ఎలాంటి ప్రమాదం కాకుండా వాహనాలు, వ్యవసాయదారులు క్షేమంగా ప్రయాణ చేయొచ్చని ఈప్రాంత ప్రజలు విజ్ఞప్తి చేస్తున్నారు.

మున్సిపల్ చైర్‌పర్సన్ జన్మదిన వేడుకలు



వేడుకల్లో కౌన్సిలర్లు, బీఆర్‌ఎస్ నాయకులు

పెద్దపల్లిరూరల్: పెద్దపల్లి మున్సిపల్ చైర్‌పర్సన్ మమతారెడ్డి జన్మదిన వేడుకలను బుధవారం పట్టణంలో నిర్వహించారు. బీఆర్‌ఎస్ పట్టణ అధ్యక్షుడు ఉప్పు రాజ్‌కుమార్‌తోపాటు పలువురు కౌన్సిలర్లు, పార్టీ నాయకులు కేక్ కట్ చేసి శుభాకాంక్షలు తెలిపారు.